
సాక్షి ఒడిశా

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,31,113లు, బంగారం 440 మిల్లీగ్రాములు, వెండి 9 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తున్నామని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు.

- 8లో.



భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

బరంపురం కేదారేశ్వర ఆలయ మండప ప్రాంగణంలో మార్గశిర శుక్ల పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు మంగళవారం నిర్వహించారు.

- 8లో.

న్యూస్‌రీల్

సువేందు సేవలు మరువలేనివి

భువనేశ్వర్: స్థానిక రైల్వే న్యూ కాలనీ అభివృద్ధికి సువేందు (మెఘు) పరిజా అందించిన సేవలు మురువలేనివని వక్తలు అన్నారు. ఆయన మృతికి అశోక్ బలియార్‌సింఘ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంతాప సభ మంగళవారం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మెఘు ఓటమి ఎరుగని కార్పొరేటర్‌గా గుర్తింపు పొందారన్నారు. వరుసగా 5 సార్లు జట్నీ మున్సిపల్ రైల్వే న్యూ కాలనీ వార్డు కార్పొరేటరుగా ఎన్నికయ్యారని గుర్తు చేసుకున్నారు. వార్డుల పునర్వ్యవస్థీకరణ పురస్కరించుకుని ఈ వార్డు మహిళలకు కేటాయించడంతో ఆయన పూర్తిస్థాయిలో సంఘ సేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు. ఆయన సేవలకు గుర్తుగా జట్నీలో డయాలిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. డయాలిసిస్ చికిత్స సౌకర్యం స్థానికంగా అందుబాటులో లేనందున పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు.

కొండచిలువ కలకలం



కొండచిలువతో ఆశిరాజ్

బరంపురం: స్థానిక మదనపల్లిలో 10 అడుగుల కొండచిలువ సోమవారం రాత్రి కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకి చెందిన ఆశిరాజ్ చాకచక్యంతో కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం దగ్గరలో ఉన్న చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు గెలిచిన విద్యార్థులతో నిర్వాహకులు

జయపురం: ఈనెల 22, 23, 24 తేదీల్లో భువనేశ్వర్‌లో నిర్వహించిన అఖిల భారత ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్–23 పోటీల్లో జయపురం ఉత్కళ కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. పోటీల్లో పాల్గొన్న 10 మంది విద్యార్థుల్లో ఆరుగురికి 2 స్వర్ణ పథకాలు, 6 బ్రాంజ్ పథకాలు దక్కాయి. తమ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంపై కరాటే పాఠశాల ప్రధాన కోచ్, భారతీయ మ్యాచ్ రిఫరీ మున్న సింగ్ లాల్ (బ్లాక్ బెల్ట్), కోచ్ కృష్ణ హంతాల్(బ్లాక్ బెల్ట్) తదితరులు అభినందనలు తెలిపారు.

నిరాశ్రయులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బరంపురం: నగరంలోని నిరాశ్రయులకు సోమవారం అర్ధరాత్రి సస్ అండ్ నీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. రోజురోజుకీ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంగణాల్లో ఉన్నటువంటి పేదలకు అందజేశారు. మాజీ కార్పొరేటర్ మురళీరావు సహకారంతో మాజీ ఎమ్మెల్యే డా.రమేష్ చంద్రచావ్ పట్నాయక్ తదితరులు సుమారు వందమంది నిరాశ్రయులకు వితరణగా అందించి ఆదర్శంగా నిలిచారు.

కృష్ణమూర్తికి శిక్షక రత్న అవార్డు



కృష్ణమూర్తి మాస్టర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: రాష్ట్రేతర తెలుగు సమాఖ్య వార్షిక సమావేశం తెలుగు విజ్ఞాన సమితి సౌజన్యంతో బెంగుళూరులో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించారు. సమావేశాలకు ఢిల్లీ, ఖరగ్‌పూర్, అహ్మదాబాద్, చెన్నై, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో నివసిస్తున్న తెలుగు కళాకారులు, రచయితలు, గాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన రా.తె.సా సభ్యుడు పి.కృష్ణమూర్తి మాస్టార్‌ను శిక్షక రత్న బిరుదుతో సన్మానించారు. ఆయన రాసిన ప్రణతి పుస్తకాన్ని సమావేశంలో అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని రాష్ట్రేతర తెలుగు సమాఖ్య అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు, కన్వీనరు పి.వి.పి.సి.ప్రసాద్ పర్యవేక్షించారు.

రారండోయ్ వేడుక చూద్దాం..!

- ప్రాకార ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానాలు
- శ్రీమందిరం నుంచి బయల్దేరిన బృందాలు
- జనవరి 17న సుమూర్తం



ఆహ్వాన పత్రాల పంపిణీకి బయల్దేరిన బృందం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ మందిరం వారసత్వ ప్రాకార ప్రాజెక్టు ప్రజాంకితం కార్యక్రమం దగ్గరపడుతోంది. వచ్చే ఏడాది జనవరి 17న సుముహూర్తం నిర్ణయించారు. ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శ్రీమందిరం దేవస్థానం, పాలక మండలి వర్గం నడుం బిగించాయి. శాస్త్రీయ రీతిలో ఈ మహోత్సవం జయప్రదం చేయాలని సమష్టిగా ప్రయత్నిస్తున్నారు. ఆహ్వాన పత్రికల పంపిణీ నుంచి యజ్ఞ హోమాదుల నిర్వహణ ఇతరేతర పవిత్ర కార్యకలాపాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించే ప్రక్రియ ప్రారంభించారు.

30 బృందాలుగా వెళ్లి..

పూరీలో జరిగే శ్రీమందిర్ పరిక్రమ ప్రాకర ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను పంపిణీ చేసేందుకు 30 బృందాలు మంగళవారం ఉదయం జగన్నాథ ఆలయ ప్రాంగణం నుంచి బయల్దేరాయి. పవిత్ర మార్గశిర పూర్ణిమ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఆహ్వానాలు ప్రారంభించడం విశేషం. 30 బృందాల్లో 13 బృందాలు ఒడిశాలోని వివిధ ప్రాంతాల్లో ఆహ్వాన పత్రికలను పంపిణీ చేయనుండగా, మిగిలిన 17 బృందాలు రాష్ట్రం వెలుపల పంపిణీ చేయనున్నాయి.

పుణ్యక్షేత్రాలకు పిలుపు

శ్రీమందిర్ పరిక్రమ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి వివిధ దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, మఠాలు, మత పెద్దలతో సహా ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఒక బృందం ఆహ్వాన పత్రంతో స్థానిక లింగరాజు ఆలయానికి చేరుకుంది. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆహ్వానించేందుకు ఈ బృందం నవీన్ నివాస్‌ను సందర్శించింది.

జగద్గురువుకు తొలి ఆహ్వానం

అంతకుముందు ఈ మహోత్సవపు తొలి ఆహ్వానాన్ని పూరీ గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు స్వామి నిశ్చలానంద సరస్వతికి శ్రీమందిరం సీఏవోతో కూడిన పాలక మండలి ప్రతినిధి బృందం అందించింది. రాష్ట్రంలో తొలి బృందం చిలికా, ఖల్లికోట్ ప్రాంతాల్లో పర్యటిస్తుంది. రెండో బృందం పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, మూడో బృందం భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్, భద్రక్, నాల్గవ బృందం బాలేశ్వర్, మయూర్‌భంజ్, కెంజొహర్, ఐదో బృందం ఢెంకనాల్, అంగుల్, దేవ్‌గడ్, ఆరో బృందం సంబల్‌పూర్, ఝార్సుగుడ, సుందర్‌గడ్, ఏడో బృందం కందమాల్, బౌద్, సోన్‌పూర్, ఎనిమిదో బృందం ఖుర్దా, నయాగఢ్, గంజాం, తొమ్మిదో బృందం బొలంగీర్, నువాపడా, బర్‌గడ్, పదో బృందం కలహండి, నవరంగ్‌పూర్, కొరాపుట్, మల్కన్‌గిరి, పదకొండో బృందం గంజాం, గజపతి, రాయగడ, పన్నెండో బృందం దారుక్షేత్రం పూరీ, కాకత్‌పూర్, ఖుర్దా, జగత్‌సింగ్‌పూర్, సాలేపూర్, పదమూడో బృందం దొధిమచ్ఛాగొడియా, అస్తరంగ్, నియాలి, రాయచక్రధర్‌పూర్, డెలాంగ్‌లలోని వివిధ దేవదేవీ పీఠాలు, జగన్నాథ మందిరాలకు ఆహ్వానాలు అందిస్తాయి.

30 వాహనాల్లో పయనం

రాష్ట్రం, రాష్ట్రేతర మరియు దేశవ్యాప్తంగా విస్తరించిన ఉనన శ్రీజగన్నాథ దేవస్థానాలు, ప్రముఖ మఠాలు, మఠాధిపతును ఆహ్వానించేందుకు సమగ్రంగా 30 వాహనాల్లో 30 బృందాలు బయల్దేరాయి. వీటిలో 13 వాహనాలు రాష్ట్రంలో, 17 వాహనాల్లో రాష్ట్రేతర ప్రాంతాల్లో ప్రముఖులను ఆహ్వానించేందుకు పిలుపు బృందాలు బయల్దేరాయి. రాష్ట్రం వెలుపల న్యూఢిల్లీ హాజ్‌ఖాస్ శ్రీజగన్నాథ ఆలయం, మథుర, బృందావనం, ముంబై సిద్ధి వినాయక ఆలయం, జగన్నాథ ఆలయం, భీమ శంకర జ్యోతిర్లింగ క్షేత్రం, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రం, ఘృణేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రం, తిరుమల వేంకటేశ్వర క్షేత్రం, తిరుపతి పద్మావతి ఆలయం, తిరుపతి విశ్వవిద్యాలయం జగన్నాథ ఆలయం, కాంచీపురం కామాక్షి, మదురై మీనాక్షి, రామేశ్వరం, చెన్నై జగన్నాథ దేవాలయం, బద్రీనాథ్, కేదార్‌నాథ్, జోషిమఠ్, ఉత్తరకాశీ జగన్నాథ ఆలయం, ద్వారక ద్వారకాధీష్, నాగేశ్వర్ జ్యోతిర్లింగ, సూరత్, జమాల్‌పూర్ జగన్నాథ ఆలయం, కాశీ విశ్వనాథ్, అయోధ్య ఆలయం, చిత్రకూట్, వైష్ణవ దేవి, అమర్‌నాథ్ ఆలయం, రఘునాథ మందిరం, నేపాల్ పశుపతినాథ్, సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహ స్వామి, తిరువనంతపురం పద్మనాభ స్వామి ఆలయం, శబరిమలై, గురువాయూరు, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, బొడొధామ్, కాళీఘాట్, దక్షిణేశ్వర్ కాళీపీఠ్, తారాపీఠ్, చాముండేశ్వరి ఆలయం సహా దేశంలోని ఇతర ప్రధాన జగన్నాథ ఆలయాలకు ఆహ్వానాలు అందుతాయి.



శంఖ ధ్వనితో పిలుపు బృందాలకు అభినందన



సీఎం నవీన్ పట్నాయక్‌కు ఆహ్వానం అందజేస్తున్న శ్రీమందిరం పాలక మండలి సభ్యులు, సేవాయత్ ప్రతినిధుల బృందం

రౌర్కెలా టు కోల్‌కతా

- అందుబాటులోకి విమానయాన సౌకర్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో రౌర్కెలా నుంచి కోల్‌కతాకు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ఏడాది అక్టోబర్‌లో భువనేశ్వర్ మీదుగా కోల్‌కతా నుంచి రౌర్కెలాకు విమానయాన సేవలు ప్రవేశపెట్టారు. వారానికి 3 సార్లు (మంగళవారం, గురువారం, ఆదివారం) ఈ సేవలు ఉండేవి. అయితే తాజాగా రౌర్కెలా – కోల్‌కతా మధ్య ప్రత్యక్ష విమాన సేవలు ప్రారంభించడంతో రౌర్కెలా – భువనేశ్వర్ మధ్య విమానయాన సేవల వేళల సవరణ అనివార్యం అవుతుంది. దీంతో ప్రయాణ సమయం గంటా ముప్పై నిమిషాలకు తగ్గుతుంది. 35 సీట్లుతో రౌర్కెలా – కోల్‌కతా ఛార్జీ రూ.1,999 పరిమితం చేయడం విశేషం. ఇది సుందర్‌గడ్ జిల్లాలో పరిశ్రమలు మరియు పర్యాటక రంగం పురోగతికి దోహదపడుతుంది. ఏటీఆర్ –72 అలయన్స్ ఎయిర్ విమానం సేవలు లాంఛనంగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయంత్రం 4.05 గంటలకు రౌర్కెలా నుంచి బయల్దేరి సాయంత్రం 5.35 గంటలకు కోల్‌కతాలో ల్యాండ్ అయింది. ఇతర రోజుల్లో రౌర్కెలా నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.20 గంటలకు కోల్‌కతా చేరుకుంటుంది. కోల్‌కతాలో ఉదయం 11 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు రౌర్కెలా చేరుకుంటుంది.

అలరించిన సంగీత విభావరి

పర్లాకిమిడి: స్థానిక ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సులలిత సంగీత భారతి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అన్నమయ్య సంగీత విభావరీ సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయకుడు టి.కాంతారావు దీప ప్రజ్వలన చేయగా, గౌరవ అతిథులు సీనియర్ న్యాయవాది వీఎస్ఎన్ రాజు, విశ్రాంత ప్రిన్సిపాల్ టి.తిరుపతిరావులు ప్రారంభించారు. కాకినాడకు చెందిన గాయకుడు అక్కిరాజు శ్రీనివాస్ స్వర కల్పన చేయగా, ఫ్లూట్‌పై వెల్లంకి కూర్మనాథం, కీబోర్డుపై ఐ.వి.రమణ, కె.రాజేష్ (పెయిర్స్), తబలాపై సూర్యనారాయణ, కోరస్ మోహిత్, డి.అఖిల్‌లు సహకరించారు. గాయకురాలు విజయలక్ష్మి, టి.కాంతారావులు సుమధురంగా అన్నమయ్య గీతాలు పాడి శ్రోతలను అలరించారు. అనంతరం అక్కిరాజు శ్రీనివాస్‌కు కార్యదర్శి ఎం.శివరామకృష్ణ, వీఎస్ఎన్ రాజు, కూర్మనాథం, కె.శోభారాణి చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో డా.ఆర్.ఆర్.రవి, ఇసై తాతారావు, చెట్టి వేంకటేశ్వర్లు, కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గాయకుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

గున్న ఏనుగులకు కుమ్కి శిక్షణ



మహంత పర్యవేక్షణలో గున్న ఏనుగులు

భువనేశ్వర్: నగరం శివారులోని చందక డొంపాడా వన్యప్రాణుల అభయారణ్యంలో మందల నుంచి వేరు చేయబడిన 7 గున్న ఏనుగులకు కుమ్కి శిక్షణ ఇవ్వనున్నారు. అభయారణ్యంలోని కుమార్‌ఖుంటి సెంటర్లో గున్న ఏనుగులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియ చేపడతారని చందక డీఎఫ్‌వో శరత్ బెహెరా తెలియజేశారు. దీంతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వాటిని రవాణా చేయడం ప్రారంభించారు. ఢెంకనాల్ జిల్లా కపిలాస్‌కు చెందిన 5 గున్న ఏనుగులు కార్తీక, ఉమ, పద్మ, శ్యామ, శివ, భువనేశ్వర్ సమీపంలోని నందన్‌కానన్ జూ నుంచి మమ్మా, సిమిలిపాల్ సౌత్ జెనబిలి నుంచి జగన్నాథ్‌లను శిక్షణ కోసం కుమార్ ఖుంటి కేంద్రానికి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఒడిశా, అస్సాం, కర్ణాటకకు చెందిన మహంతులు గున్న ఏనుగుల సంరక్షణ పర్యవేక్షిస్తారు. నిపుణులైన శిక్షకుల సమక్షంలో కుమ్కి శిక్షణను ఇస్తారు. పూర్తి శిక్షణ పొందిన తర్వాత కుమ్కి ఏనుగులు వేటగాళ్ల, కలప మాఫియాను ఎదుర్కోవడానికి అడవుల్లో నిమగ్నమై ఉంటాయి. అంతేకాకుండా పర్యాటకుల సందర్శనకు కూడా వీటిని ఉపయోగించవచ్చని తెలిపారు.

జగన్నాథ ఆలయానికి పటిష్ట భద్రత



సువిశాల పూరీ శ్రీజగన్నాథ దేవస్థాన ప్రాంగణం

- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బెటాలియన్
- ఆమోదం తెలిసిన సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: పూరీలోని జగన్నాథ ఆలయ భద్రత, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక భద్రతా బెటాలియన్ ఏర్పాటు ప్రతిపాదనకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆమోదం తెలిపారు. 5టీ, నవీన్ ఒడిశా చైర్మన్ వి.కె.పాండియన్ సమర్పించిన సమాచారం ఆధారంగా అనుబంధ వాటాదారులతో చర్చించిన మేరకు ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదనను ఆమోదించారు. జగన్నాథ ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తారని చర్చ సందర్భంగా విశ్లేషించారు. కోవిడ్ అనంతర కాలంలో రోజువారీ భక్తుల సంఖ్య 50,000గా అంచనా వేయబడింది. వారాంతాల్లో, ముఖ్యమైన మతపరమైన పండగలు, ఉత్సవ సందర్భాల్లో ఈ తాకిడి రెట్టింపు నుంచి మూడు రెట్లు పెరుగుతుంది. అలాగే వారసత్వ ప్రాకార ప్రాజెక్ట్ – శ్రీమందిర్ పరిక్రమ ప్రకల్పను ప్రజలకు అంకితం చేసిన తర్వాత ఆలయానికి భక్తుల ప్రవాహం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక భద్రతా బెటాలియన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం విశేషం. కొత్త బెటాలియన్‌లో దాదాపు 1,190 మంది సిబ్బంది ఉంటారు. వీరంతా పూరీ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అధీనం, నియంత్రణలో పని చేస్తారు. శ్రీ మందిరానికి పూర్తి భద్రత కల్పించడం ప్రధాన బాధ్యత. మెరుగైన రద్దీ నియంత్రణతో భక్తులకు ఇబ్బంది లేని, క్రమబద్ధమైన దర్శనం కోసం సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వబడుతుందని అధికార వర్గాల సమాచారం.

సందడిగా చౌయితి ఉత్సవాలు

రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి చౌయితి ఉత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్థానిక మజ్జిగౌరి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుంచి కలశాలతో శుద్ధ జలాలను తీసుకొచ్చి ఉత్సవ వేదికపై నిలిపారు. ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు, డొంగిరియా కొందొ తెగల వాయిద్యాలు, యువత వేషధారణలు ఆకట్టుకున్నాయి. మజ్జిగౌరి మందిరం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు వాటర్ బాటిళ్లను సరఫరా చేశారు. ర్యాలీలో విదేశీయులు సైతం పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రి జగన్నాథ సరక, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి, ఎమ్మెల్యే మకరంద ముదులి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, ఓబీసీ, వెనుకబడిన జాతుల రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పృథ్వీరాజ్ సాహు, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక తదితరులు పాల్గొన్నారు.

– రాయగడ



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సరక, ఎంపీ సప్తగిరి తదితరులు



వాటర్ బాటిళ్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు



సెల్ఫీ జోన్ వద్ద సందడి వాతావరణం



ఉత్సవ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్



స్థానికుల వేషధారణలు



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



విదేశీయుల సందడి



శుద్ధ జలాలను తీసుకొస్తున్న దృశ్యం



డొంగిరియా తెగల నృత్య విన్యాసాలు

క్లుప్తంగా

అధ్యక్షుడిగా రంజన్ కుమార్



రంజన్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: భువనేశ్వర్‌లోని ఆర్య స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఉత్కల సమ్మేళనం అధ్యక్షుడు రంజన్ కుమార్ స్వయి నియమితులయ్యారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

ఈ నెల 31తో ముగుస్తున్న బీఆర్‌ఏయూ రిజిస్ట్రార్ టెర్మ్



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ టెర్మ్ ఈ నెల 31తో ముగియనుంది. వర్సిటీ రిజిస్ట్రార్‌గా 2022 జనవరి 1న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికి రెండేళ్లు పూర్తయ్యింది. నిబంధనల మేరకు రిజిస్ట్రార్‌ను ఏడాదికి నియమిస్తారు. ఆ తర్వా త ఉన్నత విద్యాశాఖ అనుమతులతో మరో ఏడాది రెన్యువల్ చేయవచ్చు. ప్రస్తుత రిజిస్ట్రా ర్ రెండు టెర్మ్‌లుగా రెండేళ్లు బాధ్యతలు నిర్వహించారు. ప్రసుత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మూడేళ్ల టెర్మ్ జనవరి 18తో పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ రిలీవ్ కావాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు ఆయన నిర్ధారించారు.

గిన్నిస్ రికార్డులో లయశ్రీ నృత్యకారిణులు



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పాల్గొన్న పరిమళ బృందం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణానికి చెందిన లయశ్రీ నృత్య కళానికేతన్ శిష్య బృందం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం పొందిందని నృత్య నికేతన్ గురువు కె.పరిమళ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాదు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో తనతో పాటుగా 25మంది శిష్య బృందం పాల్గొని ఏడు నిమిషాల పాటు లయబద్ధంగా కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డు సాధించినట్లు పేర్కొన్నారు.

మూలపేట పోర్టు సందర్శనలో స్వల్ప మార్పులు

నరసన్నపేట: సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోర్టు సందర్శనలో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముందుగా ప్రకటించినట్లు బుధవారం కాకుండా గురువారం నాడు పోర్టు సందర్శన ఉంటుందని తెలిపారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు గమనించాలని సూచించారు. గురువారం పోర్టు సందర్శనకు పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిలో పాటు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ రానున్నారని, జిల్లాకు చెందిన మంత్రులు పాల్గొంటారని తెలిపారు. అలాగే పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనితీరు కూడా అదే రోజు పరిశీలిస్తారని ఆయన తెలిపారు.

ఆర్థిక పురోగతికి ప్రణాళికలు

నరసన్నపేట: గ్రామాల్లో ఆర్థిక పురోగతికి తగిన చర్యలు చేపట్టాలని దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (ఐబీ) మోహనరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘాల ఓబీ సభ్యులతో పాటు ఏపీఎంలకు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కలలు కనాలని, వాటి సాధనకు వీలుగా కార్యాచరణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, జీవన ప్రమాణాలు పెంపొందించడం, మూఢ నమ్మకాలను నిర్మూలించడం, బాల్య వివాహాలు అరికట్టడం, బ్యాంకు రుణాల ద్వారా మహిళలు మినీ పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మరో ఐకేపీ అధికారి వైకుంఠరావు, ఏరియా కోఆర్డినేటర్ కొండలరావు, లీగల్ ఏపీఎం బసవరాజు, పది మండలాలకు చెందిన ఏపీఎంలు, నరసన్నపేట ఏపీఎం హేమసుందర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వర్: బిజూ పట్నాయక్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



బరంపురం: బిజూ పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



జయపురం: మారథాన్ ప్రారంభిస్తున్న మాజీ మంత్రి నందో

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన



పర్లాకిమిడి: స్టేడియం వద్ద కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



రాయగడ: పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న నెక్కంటి



రాయగడ: కొండబాబు ఆధ్వర్యంలో బీజేడీ ర్యాలీ

- సీఎం నవీన్ పట్నాయక్
- ఘనంగా బీజేడీ వ్యవస్థాపక దినోత్సవం

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తున్నామని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. బీజేడీ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ విగ్రహం వద్ద మంగళవారం అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, రైతులు, యువజన సంక్షేమం, ఆధునిక ఒడిశా నిర్మాణానికి బిజూ పట్నాయక్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

రాయగడలో...

రాష్ట్రంలో అధికార బీజేడీ హయాంలో ప్రజలకు సుపరిపాలన అందుతోందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. పట్టణంలో బీజేడీ వ్యవస్థాపన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్త బస్టాండ్ వద్దనున్న బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆవిర్భవించిన బీజేడీ ప్రజల కష్ట, సుఖాల్లో తోడుంటుందని తెలియజేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి సోపానాలని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసి జిల్లాలో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేడీలో చేరారు. వారిని నెక్కంటి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు జగదీష్ పాత్రో, ఎస్డీసీ చైర్మన్ అనసూయ మాఝి, రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, మాజీ మంత్రి లాల్ బిహారీ హిమిరిక, కాశీపూర్ సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి, రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, వైస్ చైర్మన్ శుభ్రా పండ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేడీ సీనియర్ నాయకుడు కొండబాబు ఆధ్వర్యంలో సైతం పార్టీ వ్యవస్థాప దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, అమో ఒడిశా నవీన్ ఒడిశా కన్వీనర్ పట్నాన గౌరిశంకర్ తదితర పాల్గొన్నారు.

బరంపురంలో...

ప్రజా సంక్షేమమే సీఎం నవీన్ పట్నాయక్ ధ్యేయమని బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా అన్నారు. స్థానిక దేశిబెహరా వీధిలో బీజేడీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎంపీ చంద్రశేఖర్ సాహు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఎంకేసీజీ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్న రోగులకు బీజేడీ మహిళా నాయకులు పండ్లు పంపిణీ చేశారు. అలాగే మున్సిపల్ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బిజయ్ సామల్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మమత బిసాయి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంఘమిత్ర దొళాయి పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో...

బీజేడీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హైస్కూల్ జంక్షన్ వద్ద బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గజపతి స్టేడియం వద్ద జరిగిన రక్తదాన శిబిరంలో బీజేడీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఎంపీ చంద్రశేఖర సాహు పండ్లు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో బీజేడీ కో–అబ్జర్వర్ శశి భూషన్ మహంతి, తిరుపతి పాణిగ్రాహి, బీజేడీ రాష్ట్ర కార్యదర్శులు మారుత్ పాలో, బసంత్ దాస్, ప్రదీప్ నాయక్, కాశీనగర్ ఎన్‌ఏసీ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, కాశీనగర్ సమతి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, బీజేడీ మహిళా అధ్యక్షురాలు సంజుక్తా బెహారా, యువరాణి కల్యాణీ దేవి తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో...

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి చరిత్ర సృష్టించాలని మాజీ మంత్రి రబినా రాయణ నందో పిలుపునిచ్చారు. బీజేడీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో మారథాన్ రన్‌ను మంగళవారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన మారథాన్‌లో వందలాది మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ బీజేడీ అధ్యక్షుడు హర మిశ్ర, కార్యవర్గ అధ్యక్షుడు సహదేవ్ పట్నాయక్, బపి పొరిడ, మహిళ బీజేడీ నాయకురాలు డాక్టర్ ఇందిర నందో తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: నెక్కంటి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జయపురం: రక్తదానం చేస్తున్న దాతలు



ఎర్లాకిమిడి: రక్తదాన శిబిరంలో రూపేష్ పాణిగ్రాహి తదితరులు



బరంపురం: రక్తదానం చేస్తున్న యువత

తీరంలో విషాదం



సముద్రంలో గాలిస్తున్న స్థానిక మత్స్యకారులు

- విహార యాత్రకు వచ్చి గల్లంతైన విద్యార్థులు
- ఇద్దరిని రక్షించిన మత్స్యకారులు
- లభించని ఒకరి ఆచూకీ
- మందస మండలం సిగలపుట్టుగ బీచ్‌లో ఘటన



సముద్రంలో గల్లంతైన విద్యార్థి జయరాం

మందస: సరదాగా గడుపుదామని సముద్ర తీరానికి వచ్చిన విద్యార్థులకు విషాదం ఎదురైంది. ముగ్గురు విద్యార్థులు సముద్రంలో గల్లంతైపోగా.. ఇద్దరు దొరికారు. మరొకరి ఆచూకీ లభించలేదు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీ, రట్టి తీరంలోని సిగలపుట్టుగలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం బెల్లుపడలోని ఓ ట్యూషన్ సెంటర్ నుంచి సుమారు 38పైగా విద్యార్థులు సిగలపుట్టుగ బీచ్‌కు మంగళవారం పిక్నిక్ చేసుకుందామని వచ్చారు. తీరంలో ఆనందంగా గడిపిన విద్యార్థులు సముద్ర స్నానానికి దిగారు. పెద్ద అల రావడంతో పలువురు విద్యార్థులు కొట్టుకుపోయా రు. కొంతమంది ఒడ్డుకు రాగా, ఆశి జయరాం, ఎస్.మేఘన, బి.చందు అనే విద్యార్థులు గల్లంత య్యారు. స్థానిక మత్స్యకారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. తీరంలోని గ్రామాల్లో గల మత్స్యకారులకు కూడా ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారంతా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ లోగా మెరైన్ సీఐ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నా రు. మత్స్యకారులు చందు, మేఘనను కష్టపడి ఒడ్డుకు తీసుకురాగలిగారు. వీరు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఆశి జయరాం ఆచూకీ మాత్రం లభించలేదు. ప్రమాదంపై విద్యార్థుల కుటుంబాలకు సమాచారం అందజేశారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు ఆపారు.

ఒక్కడే కుమారుడు

ఇచ్ఛాపురం: గల్లంతైన ఆశి జయరాం తల్లిదండ్రులు హరికృష్ణ, నాగమ్మ దంపతులకు చిన్న కుమారుడు. వీరికి ముగ్గురు సంతానం కాగా ఇద్దరు ఆడ పిల్లల తర్వాత జయరాం జన్మించాడు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జయరాం తోటి విద్యార్థులతో సరదాగా ఉండేవాడు. జయరాం సముద్రంలో గల్లంతైపోయాడన్న వార్త తెలిసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. ఆచూకీ లభించకపోవడంతో తమ కుమారుడు ఎలాగైనా బతికి బయటపడాలని దేవుళ్లకు మొక్కుకున్నారు.



మేఘన



డి.చందు



భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

స్థానిక కేదారేశ్వర ఆలయ మండప ప్రాంగణంలో మార్గశిర శుక్ల పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

\- బరంపురం



అదుపు తప్పిన ట్రావెల్ బస్సు



సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న పిరియా సాయిరాజు

ఇచ్ఛాపురం రూరల్: డబ్బై మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. వివరాల్లోకి వెళితే.. జార్ఖండ్ రాష్ట్రం దుమ్కా జిల్లా రామిలసూదన్ ప్రాంతానికి చెందిన 50 మంది కేరళ రాష్ట్రం కురుస్‌పల్లి ప్రాంతంలో వ్యవసాయ కూలీలుగా పనులు చేస్తున్నారు. సంక్రాంతి రానున్న నేపథ్యంలో ముందస్తుగా స్వగ్రామానికి వెళ్లేందుకు పిల్లా, పాపలతో కలసి సుమారు 70 మంది కూలీలు ఆదివారం ఉదయం కేరళ రాష్ట్రం కట్టప్పన్ బస్టాండ్ నుంచి ట్రావెల్ బస్సులో బయల్దేరారు. మంగళవారం మధ్యాహ్నం బస్సు లొద్దపుట్టి గ్రామ 16వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న సమయంలో బస్సు ఒక్కసారిగా పక్కకు పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో నిద్రమత్తులో ఉన్న కూలీలు బస్సు లోయలో పడిపోయిందన్న ఆందోళనతో హాహాకారాలు చేశారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించి బస్సులో ఉన్న కూలీలు, చిన్నారులను సురక్షితంగా రక్షించారు. చిన్నపాటి గాయాలతో బయటపడిన కూలీలకు ప్రథమ చికిత్సను అందజేశారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ నర్తు నరేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని కూలీలకు ధైర్యం చెప్పారు. రాత్రి గ్రామంలో భోజన వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులను కోరారు. స్పందించిన గ్రామస్తులు మధ్యాహ్నం హోటల్ నుంచి భోజనాలు తెప్పించి క్షతగాత్రులకు అందజేశారు. డ్రైవర్ టీజాటిక్క పరారీలో ఉండగా, ఆయనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.రమేష్ తెలిపారు.

28న రాష్ట్ర అంతర్‌జిల్లాల టెన్నీ కాయిట్ పోటీలు

పాతపట్నం: ఆంధ్రప్రదేశ్ అంతరజిల్లాల స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ పోటీలు 28న నిర్వ హించనున్నామని జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు యెన్ని శేఖర బాబు మంగళవారం తెలిపారు. ఈ పోటీలు పాతపట్నం మండల కేంద్రంలోని మినీస్టేడియం క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30తేదీ వరకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

బంతి పూలసాగుతో అధిక లాభాలు

కోటబొమ్మాళి: పూర్ణిమ ఎల్లోరకం బంతి పూల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆమదాలవలస కేవీకే హార్టీకల్చరర్ శాస్త్రవేత్త డాక్టర్ వి. హరి కుమార్ అన్నారు. కోటబొమ్మాళి మండలం చిన్న సాన గ్రామానికి చెందిన రైతు మేడిబోయిన నారాయణరావుకు చెందిన పూర్ణిమ ఎల్లోరకం బంతి పూల సాగును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు విధానాలు, దిగుబడి, పూలకోత అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ విస్తరణాధికారి జి.సంధ్య, ఉద్యానవన శాఖాధికారి కె.సునీత పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో 238 మందికి రెగ్యులర్‌కు చర్యలు



కాంట్రాక్ట్ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: ఏళ్ల తరబడి వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న వివిధ క్యాడర్ల ఉద్యోగుల జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపేలా వైఎస్ జగన్ సర్కారు చర్యలకు దిగింది. ఆయా శాఖాధికారులు అర్హులకు రోస్టర్ ప్రకారం రెగ్యులర్ చేసేలా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం జిల్లాలో మొత్తం 238 మంది ఉద్యోగుల ధ్రువీకరణ పత్రాల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్లు–210 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు–10, ఫార్మాసిస్టులు–08 మంది, ఏఎన్‌ఎంలు–04, స్టాఫ్ నర్సులు–06 మంది మొత్తంగా 238 మందికి రెగ్యులర్ ఉద్యోగులయ్యే అవకాశం లభించింది. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన వరాన్ని ప్రసాదించిందని, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న మొత్తం 238 మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా త్వరలోనే పరిగణించేలా ఉత్తర్వులు రానున్నాయన్నారు. అయితే ఇందులో ధ్రువీకరణ పత్రాలన్నీ డైరక్టరేట్ కార్యాలయానికి పంపించాల్సి ఉందని, తదుపరి అక్కడే పత్రాలన్నీ అప్‌లోడ్ అవుతాయని, తర్వాత ఉన్నతాధికారుల నిర్ణయాల ప్రకారం రెగ్యులర్ చేసే ప్రక్రియ మొదలవుతుందని వివరించారు.

రెగ్యులర్ చేసే క్రమంలో ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని, ప్రలోభాలకు లొంగవద్దని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నియామకాల నుంచి పదోన్నతులు, రెగ్యులర్ చేసే ప్రతి పనిని అత్యంత పారదర్శకంగా చేస్తోందని గుర్తుచేశారు.

క్లుప్తంగా

లారీ, కారు ఢీ: త్రుటిలో తప్పిన ప్రమాదం



ధ్వంసమైన కారు ముందు భాగం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి రైల్వే బ్రిడ్జిపై మంగళవారం ఉదయం లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందర భాగం పూర్తిగా ధ్వంసమైంది. చీపురుపల్లి నుంచి విజయనగరం కారు వెళ్తుండగా అదే రహదారిలో ఎదురుగా విజయనగరం నుంచి చీపురుపల్లి వస్తున్న లారీ ఢీకొన్నాయి. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఆయా వాహనాల్లో ప్రయాణిస్తున్న ఏ ఒక్కరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గరివిడి ఎస్సై ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కైమార్షల్ ఆర్ట్స్‌లో కొత్తవలస క్రీడాకారుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీల్లో 24 గోల్డ్ మెడల్స్ సొంతం



గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులతో త్రినాథరావు

కొత్తవలస: ఈనెల 24,25 తేదీల్లో చిత్తూరు జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మంటపంలో జరిగిన ఆరవ రాష్ట్ర స్కై మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో కొత్తవలస మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర వైస్‌చైర్మన్, శిక్షకుడు ఎం.త్రినాథరావు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. వారిలో కొత్తవలస నుంచి 17 మంది పాల్గొని వివిధ విభాగాల్లో 24 గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్, 8 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను ఆయనతో పాటు మండలంలోని పలువురు అభినందించారు.

పోక్సో కేసు నమోదు

పాలకొండ రూరల్: బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు. పాలకొండ పట్టణంలోని కొండవీధికి చెందిన ఎం.దేవీప్రసాద్ ఓ బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో అసభ్యకర వీడియోలు తీసి, వాటిని స్నేహితులకు పంపించాడు. బాధిత బాలికతో పరిచయమైన యువకుడు మూడు నెలల క్రితం ఈ చర్యలకు పాల్పడగా ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వీడియోలను స్నేహితులకు నిందితుడు షేర్ చేయగా బాధితురాలి అక్కకు విషయం తెలిసింది. దీంతో ఆమె తల్లితండ్రులకు తెలియజేసింది. ఈ నేపథ్యంలో బాధిత బాలిక, తల్లిదండ్రులు సోమవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై, సీఐ మీసాల చంద్రమౌళి బాలిక దగ్గర వివరాలు సేకరించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తును డీఎస్పీ జీవీ కృష్ణారావు చేపట్టనున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన

విజయనగరం ఫోర్ట్: ఏళ్ల తరబడి చూసిన ఎదురుచూపులకు ఎట్టకేలకు మోక్షం కలుగుతుండడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల మోములో చిరునవ్వులు విరబూశాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు రెగ్యులర్ అవుతుందోలేదోనని వారంతా సతమతమయ్యేవారు. అయితే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సీఎం జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన విధంగా వైద్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి అవసరమైన ప్రక్రియను ప్రారంభించారు. దీంతో వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం పండగ వాతావరణం నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ (మేల్), ఏఎన్‌ఎం, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయడానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిమిత్తం అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ ఉద్యోగులు వచ్చారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది వారి సర్టిఫికెట్స్ పరిశీలించి పంపించారు.

భక్తిశ్రద్ధలతో కలశ జ్యోతుల ఊరేగింపు

భోగాపురం: భోగాపురంలో సోమవారం రాత్రి గురు భవానీలు కొమ్మూరు రామకృష్ణ, శీల జోగారావు, తోటయ్య, ప్రశాంత్, తిరుమరెడ్డి మురళీ అధ్వర్యంలో భవానీ మాలధారులందరూ భజనలు, భక్తి కీర్తనలతో కలశ జ్యోతులను ఊరేగిస్తూ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలదంరూ ఆయురారోగ్యాలతో సుఖంగా జీవించాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం పూజలు నిర్వహించడం జరుగుతుందని గురు భవానీలు తెలిపారు.

‘చలి’యో..చెల్లకో..!

- ఉదయం 8 గంటల వరకు కురుస్తున్న మంచు
- వణికిపోతున్న ప్రజలు
- చలికాలంలో పలు వ్యాధులు సోకే ఆస్కారం
- తగు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆస్తమా రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: జిల్లా ప్రజలను చలి వణికిస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు మంచుకురుస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. చలితీవ్రత వల్ల కళ్లాలకు వెళ్లే రైతులు, పేపర్ బాయ్‌లు ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. సాయంత్రం 5 గంటల తర్వాత చలి ప్రారంభం అవుతుండడంతో బైక్‌పై ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో కరోనాతో పాటు, చర్మ, గొంతు సంబంధిత వ్యాధులు సోకే ఆస్కారంఉంది. చలికాలంలో ఏమాత్రం అలసత్వం వహించినా వ్యాధుల బారిన పడతారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చాలా అప్రమత్తంగా ఉండాలి. చలిలో ఎక్కువగా తిరగడం, రక్షణ దుస్తులు ధరించకుండా ప్రయాణం చేసినా వ్యాధులు ప్రబలే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.

చర్మ వ్యాధులు సోకే ప్రమాదం

చలికాలంలో చర్మం పొడి బారిపోవడం, పాదాలు పగిలిపోవడం, పగుళ్ల నుంచి రక్తం కారడం వంటిసమస్యలు వస్తాయి. చర్మం పొడిబారిపోవడం వల్ల దురదలు వస్తాయి. దురదకోసం గోకితే ఎగ్జిమా (చర్మ సంబంధిత ఇన్‌ఫెక్షన్) వస్తుంది. సోరియాసిస్, ఇతియోసిస్ వంటి వ్యాధులు ఉధృతమవుతాయి. సోరియాసిస్ సోకినవారికి చేప పొట్టులా చర్మం రాలిపోతుంది. ఇతియాసిస్ సోకిన వారి చర్మం పొలుసు బారిపోతుంది.

చలిలో తిరగకూడదు

చలిలో ఉదయం 5గంటల సమయంలో, సాయంత్రం 6గంటల తర్వాత బయటకు రాకూడదు. ఊలు వస్త్రాలు ధరించడం, గ్లిజరిన్, అలోవెరా సబ్బులు వాడడం మంచిది. బైక్‌పై వెళ్లేటప్పుడు గ్లౌజులు, మఫ్లర్ వంటివి, కాళ్లకు సాక్సులు వేసుకుంటే మంచిది.

సైనసైటిస్
ముక్కునుంచి నీరు కారడం, తలనొప్పి, జ్వరం, దగ్గు, కఫం గొంతులోకి వెళ్లిపోవడం, మాటిమాటికి దగ్గాలనిపించడం వ్యాధి లక్షణాలు

అలర్జీ
చలికాలంలో వివిధ మాలాధారణ చేసే భక్తులు రెండు పూటలా తలకు స్నానం చేస్తారు. దీని వల్ల చెవిలో దురదలు, ముక్కు కారడం, పొడి దగ్గు, అలర్జీ లక్షణాలతో పాటు చెవినొప్పి కూడా వస్తుంది

టాన్సిల్స్
ఎక్కువగా చలికాలంలో వస్తాయి. మింగడం కష్టంగా ఉండడం, జ్వరం, దగ్గు వ్యాధి లక్షణాలు

జాగ్రత్తలు
తెల్లవారుజామున బయట తిరగకూడదు.
చల్లని నీళ్లు, ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్ వంటివి తినకూడదు. స్నానం చేసేటప్పుడు చెవిలోకి నీరు వెళ్లకుండా దూది పెట్టుకోవాలి. గోరు వెచ్చని నీళ్లు తాగాలి.

న్యుమోనియా
జ్వరం, చలి వణుకు, దగ్గు, కఫం పడడం, రక్తం జీరలుగా రావడం లక్షణాలు

ఆస్తమా
ఆయాసం ఎక్కువగా రావడం, సాయత్రం, రాత్రి పూట పిల్లికూతలు రావడం వ్యాధి లక్షణాలు

తీసుకోవాల్సి జాగ్రత్తలు
న్యుమోనియా, ఆస్తమా ఉన్న వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గుడ్డ అడ్డం పెట్టుకోవాలి. వ్యాధులు లేని వారు షేక్‌హ్యాండ్ ఇవ్వకూడదు. ఆస్తమా ఉన్న వారు క్రమం తప్పకుండా ముందులు వాడాలి. కాలుష్యం ఉండే ప్రాంతాల్లో తిరగకూడదు. త్వరగా నిద్రపోవాలి.

ఆహారం:
చలికాలంలో ఆకలి తక్కువగా ఉంటుంది. కాబట్టి తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. ఆకు కూరలు, కూరగాయలు తినాలి. పండ్లు ప్రతి రోజూ తీసుకోవాలి. టీ, కాఫీలు మానివేసి మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్, మసాలా ఫుడ్స్ తినకూడదు.



రామకృష్ణరాజు

కొబ్బరి నూనె, వ్యాజ్‌లైన్ వంటివి చర్మం పొడి బారిపడకుండా రాసుకోవాలి. స్నానం చేసే ముందు కొబ్బరి నూనెతో మర్దన చేసుకుంటే మంచిది.

సైనసైటిస్, అలర్జీ వచ్చే ఆస్కారం

చలికాలంలో ఎక్కువగా చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి సైనసైటిస్, అలర్జీలు, టాన్సిల్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముంది. ఈ వ్యాధులు లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కేంద్రాస్పత్రి ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ రామకృష్ణరాజు తెలియజేసిన వివరాలు.

పాక్షికంగా విగ్రహాల ధ్వంసం



ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న ఎంపీపీ బడ్నాన ప్రమీల



సంఘటనా స్థలంలో సీఐ ధనుంజయ రావు

పాచిపెంట: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి విగ్రహాలను ధ్వంసం చేసేందుకు యత్నించారు. ఇందులో భాగంగా ఆలయం వెలుపల ఉన్న విగ్రహాలను ఇటీవల ప్రతిష్ఠించిన సోమనాథ్ లింగాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. అలాగే ఒక శివలింగాన్ని ఎత్తుకెళ్లిపోవడంతో పాటు, ఆలయం బయట ఉన్న మహానంది విగ్రహం కళ్లను చితగ్గొట్టే ప్రయత్నం చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు సాలూరు సీఐ ధనుంజయ్ రావు ఘటనాస్థలానికి చేరుకుని ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించారు. తాగుబోతు వ్యక్తులు చేసిన దుశ్చర్యగా భావిస్తున్నామని, విగ్రహాల ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులను త్వరలో గుర్తించి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీఐ స్పష్టం చేశారు. ఈ దుశ్చర్యను పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఉదయం ఘటనా స్థలానికి ఆమె వెళ్లి ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



యామల జాన్ చార్లెస్ మృతదేహం



విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గజపతినగరం: మండలకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జాతీయ రహదారి వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బొబ్బిలి మండలం చింతాడ గ్రామానికి చెందిన యామల జాన్ చార్లెస్(68) మృతిచెందాడు. యామల జాన్ చార్లెస్ కొన్నాళ్లుగా గజపతినగరంలోని ఎల్ఐసీ భవనం దగ్గర పురిటిపెంట మండల వారికాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆయన టీ తాగేందుకు కాలనీ నుంచి జాతీయ రహదారి వద్దకు వస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య లిల్లీ మార్గరెట్, కుమార్తె జెస్సీ, కుమారుడు వినయ్‌కుమార్ ఉన్నారు. పిల్లలిద్దరూ హైదరాబాద్‌లో ఉంటున్నారు. తండ్రి మరణ వార్తను విన్న వారు హుటాహుటిన వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. ఇన్చార్జ్ ఎస్సై శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: కలెక్టరేట్ మెయిన్ గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. మృతుడు సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని చెప్పారు. సమీపంలో విచారణ చేపట్టినప్పటికీ ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు చెప్పారు.

శతాధిక వృద్ధుడు..



గరుగుబిల్లి: రొక్కం సత్య నారాయణ(ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన రొక్కం సత్యనారాయణ(103) మంగళవారం ఉదయం తన స్వగృహంలో మృతిచెందారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఆయన 103ఏళ్లు జీవించాడు. ఆయన భార్య 20 ఏళ్ల క్రితం మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామాయణం, భారతం,భాగవతం గ్రంథాల శ్లోకాలను అలవోకగా చదివి తాత్పర్యంతో ఆయన వివరించేవారు. తోటపల్లి ఆలయ అభివృద్ధిలో తన వంతు కృషిచేశారు. గతేడాది తోటపల్లి టెంపుల్ డెవలప్‌మెంట్ ట్రస్టీబోర్డు తొలి సర్వసభ్య సమావేశంలో 102ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనను కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఘనంగా సత్కరించారు. ఆయన మృతిపట్ల జట్టు ట్రస్టీ డి.పారినాయుడుతోపాటు పలువురు సంతాపం తెలియజేశారు.

డ్యాన్స్ గ్రాండ్ ఫినాలేలో విజయం



విద్యార్థులు సాధించిన ట్రోఫీతో అకాడమీ డైరెక్టర్ మున్నా మైఖేల్

విజయనగరం టౌన్: వైజాగ్ డ్యాన్స్ గ్రాండ్ ఫినాలే సీజన్ -2023లో స్థానిక మున్నా మైఖేల్ డాన్స్ అకాడమీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు అకాడమీ నిర్వాహకుడు మున్నా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న విశాఖ సిటీ డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సుదర్శన్ సంస్థ నిర్వహించిన కాంపిటేషన్‌లో తమ అకాడమీ విద్యార్థులు వన్షికా సింగ్, ఖుషిలు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. ఒడిశా, ఆంధ్రా నుంచి సుమారు 30 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయని, ఫినాలేలో విజేతలుగా నిలిచిన అకాడమీ విద్యార్థులు న్యాయ నిర్ణేతలు అవార్డులు అందజేశారన్నారు. ఈ మేరకు పలు డ్యాన్స్ అకాడమీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

భారీ లారీ బోల్తా



బోల్తా పడిన లోడు లారీ

భామిని: మండలంలోని బత్తిలి సమీపంలో మంగళవారం భారీ లారీ బోల్తా పడింది. ఒడిశా మీదుగా మండలంలోకి ప్రవేశిస్తున్న భారీ లారీ లోడుతో పాటు రోడ్డు నుంచి పొలాల్లోకి ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్,క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

పకడ్బందీగా డిపార్ట్ మెంటల్ పరీక్షల నిర్వహణ



మాట్లాడుతున్న డీఆర్ఓ ఎస్‌డీ అనిత

- నేటి నుంచి జనవరి 3 వరకు ఏపీపీఎస్సీ పరీక్ష
- జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీఅనిత చెప్పారు. పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లపై మంగళవారం ఆమె తన చాంబర్‌లో ఏపీపీఎస్సీ అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పరీక్షలకు 1,918 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉందన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30గంటల నుంచి 9.30 గంటల మధ్య పరీక్ష కేంద్రానికి హాజరు కావలసి ఉంటుందని చెప్పారు. నిర్ణీత సమయం తర్వాత హాజరైన వారిని లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. ఏపీపీఎస్సీ జారీ చేసిన హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపుకార్డుతో అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాజరుకావలసి ఉంటుందన్నారు. డిపార్ట్‌మెంట్ పరీక్షలకు పుస్తకాలతో సహా అనుమతి ఉన్న వారు ఏపీపీఎస్సీ అనుమతించిన అధీకృత పుస్తకాలు మాత్రమే తీసుకురావలసి ఉంటుందని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఈపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజినీర్ లక్ష్మణరావును కోరారు. అన్ని కేంద్రాల వద్ద మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ డీఎస్‌మల్లికార్జున రెడ్డి, సహాయ సెక్షన్ అధికారి జె.చంద్రరావు, ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధులు, కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీకాంత్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరావు, పరీక్షల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో మైక్రోబయాలజీ ల్యాబ్



మైక్రో బయాలజీ ల్యాబ్



కల్చర్ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్

విజయనగరం ఫోర్ట్: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం కోసం అత్యాధునిక వసతులు సమకూరుస్తోంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో కూడిన మైక్రో బయాలజీ ల్యాబ్‌ను సుమారు రూ.2 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లో యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్ పరీక్షలు చేస్తున్నారు.

బకాయిల సాధనకు దశల వారీ పోరాటం

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు హక్కుల రూపంలో రావాల్సిన ఆర్థిక బకాయిల సాధన కోసం దశలవారీగా పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు కోరారు. ఈ మేరకు స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ, పార్ట్ ఫైనల్ పేమెంట్లు, ఏపీజీఎల్ఐ బకాయిలు, సరెండర్ లీవుల బకాయాలు కోట్లలో ఉన్నాయన్నారు. 27న తాలూకా కేంద్రాలలో 6 గంటల ధర్నా, జనవరి 3న విజయనగరం జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నాలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల అందరూ పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణలో భాగంగా విద్యాసామర్థ్యంలో వెనుకబడిన విద్యార్థులకు అదనపు సమయం బోధించాలని పాతపెన్షన్ సాధన కోసం జనవరి 29న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షుడు, వి.ప్రసన్నకుమార్, కోశాధికారి సీహెచ్.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, పి.త్రినాథ్, పి.వాసుదేవరావు, బి.రామునాయుడు, వీ.రాధాభవాని, కె.శ్రీదేవి, ఎస్.సత్యనారాయణ, తిరుపతినాయుడు, రాజారావు, సూరి శ్రీను, అల్లు శంకరరావు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ముత్తయ్య మృతదేహం

జామి: పల్నాడు జిల్లా ముప్పళ్ల మండలం, కందూరివారిపాలెం గ్రామానికి చెందిన ఉసత్తి వెంకట ముత్తయ్య(28) జామి మండలంలోని ఆర్‌బీపురంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లాకు చెందిన మత్తయ్య, కుటుంబసభ్యులు మండలంలోని ఆర్‌బీపురంలో ఉంటూ టార్పాలిన్లు అద్దెకు ఇస్తున్నారు. వెంకట ముత్తయ్య అప్పుడప్పుడు మతిస్థిమితం లేనివాడిలా ప్రవర్తిస్తాడు. సోమవారం రాత్రి ఆర్‌బీ పురంలో ఇదే విధంగా ప్రవర్తించడంతో అతనితోపాటు వచ్చిన కుటుంబసభ్యులు కుమరాం గ్రామంలోని టార్పాలిన్లు భద్రపరిచేందుకు అద్దెకు తీసుకున్న షాపులో ముత్తయ్యను ఉంచారు. మంగళవారం కుటుంబసభ్యులు షాపులో చూసేసరికి ఇనుప రాడ్డుకు దుప్పటితో ఉరివేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వచ్చి పరిశీలించారు. మృతుడి తల్లి వేమలమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై వీరబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధతో..

బొబ్బిలి: అప్పుల బాధతాళలేక బొబ్బిలి పట్టణంలోని గొల్లవీధికి చెందిన కొట్నాన శ్రీరాములు (51) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీరాములు చిరువ్యాపారం చేసుకుంటూ అవసరాలకు రుణాలు తీసుకున్నాడు. వాటిని తీర్చలేకపోవడంతో ఆందోళన చెంది సోమవారం క్రిమిసంహారక మందుతాగేశాడు. కుటుంబసభ్యులు గమనించి విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలమాంబ కానుకలకు వేలంపాట



చదురుగుడిలో వేలంపాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భక్తులు సమర్పించుకున్న కానుకలకు మంగళవారం దేవదాయశాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. వచ్చేఏడాది జనవరి 22, 23, 24 తేదీల్లో పోలమాంబ అమ్మవారి జాతర జరగనుంది. జాతరలో భక్తులు సమర్పించుకున్న చీరలు, రవికలను రూ.3,40,000, కొబ్బరి చిప్పలను రూ.4,18,100, అమ్మవారి లామినేషన్ ఫొటోల విక్రయం ద్వారా రూ.88,500, దీపాల నిర్వహణకు రూ.1,18,509 కు వేలంపాటదారులు దక్కించుకున్నట్టు ఈఓ వి.వి.సూర్యనారాయణ తెలిపారు. బొబ్బిలి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజకుమారి పర్యవేక్షణలో సాగిన వేలంటపాటలో వేలంపాటదారులతో పాటు సర్పంచ్ వి.సింహాచలమమ్మ, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పూడి దాలినాయుడు, వసంతుల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపారు. అనంతరం అమ్మవారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి పర్యవేక్షించారు.